నమస్తే తెలంగాణ నిపుణ Guide to Excellence

www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

nipuna
Every Wednesday Free Supplement

03.
1 నవంబర్ 2023
పేజీలు 8

**శ్రీధర్ పిన్నపురెడ్డి**

అసోచామ్ తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కో చైర్మన్‌గా శ్రీధర్ పిన్నపురెడ్డి అక్టోబర్ 14న ఎన్నికయ్యారు. ఆయన ఈ బాధ్యతలను 2023-24 ఏడాదికి నిర్వహిస్తారు. డేటా సెంటర్లను నిర్వహించే కంట్రోల్‌ఎస్ (సీటీఆర్‌ఎల్‌ఎస్), క్లౌడ్4సీ లకు వ్యవస్థాపక సీఈవోగా పనిచేస్తున్నారు.

# ఈశాన్య భారతదేశ పండుగలు-ఉత్సవాలు

**ప్రపంచంలోని ప్రతి దేశంలో పండుగలు, ఉత్సవాలు, జాతరలు నిర్వహిస్తారు. ఇవి అనాదిగా నిర్వహిస్తున్న ఆ ప్రాంత సంప్రదాయాలను ప్రతిబింబిస్తున్నాయి. ఈశాన్య భారతదేశంలోని కొన్ని పండుగలు-ఉత్సవాలు ఎలా జరుపుకొంటారో చూద్దాం..**

### బిహు



- అసోంలో జరుపుకొనే మూడు వ్యవసాయ వేడుకల పరంపర బిహు. ప్రధాన బిహు ఏప్రిల్ నెలలో (వసంత రుతువు) వస్తుంది. దీన్ని బొహాగ్ బిహు లేదా రోంగాలి బిహు అంటారు. అస్సామీయుల సంవత్సరం బొహాగ్ బిహుతోనే ప్రారంభమవుతుంది. కాబట్టి ఇది వాళ్లకు సంవత్సరాది కూడా. ఈ బొహాగ్ బిహు వేడుకలు అస్సాం ప్రజల పంచాంగం ప్రకారం చివరి నెల చోట్ చివరి రోజున మొదలవుతాయి. మూడు రోజులు కొనసాగుతాయి.
- మొదటి రోజు పశువుల పండుగ. రెండో రోజు బొహాగ్ బిహు. ఈ రోజున పెద్దలను గౌరవిస్తారు. బంధుమిత్రులను కలిసి మిఠాయిలు, కానుకలు ఇచ్చుకుంటారు. మూడో రోజున మతపరమైన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆ వారం మొత్తం పిల్లా పెద్దా ఆటపాటలతో, బిహు ప్రత్యేక నాట్యాలతో ఆనందంగా గడుపుతారు.
- మరో బిహు మాఘమాసంలో వస్తుంది. ఇదే మాఘ్ బిహు. ఇది చలికాలపు పండుగ. ఇదే సమయంలో పంటలు ఇంటికి వస్తాయి. చలిమంటలు వేస్తూ, ఎంతో ఉల్లాసంగా ఈ మాఘ్ బిహును జరుపుకొంటారు. అక్టోబర్, నవంబర్ నెలలో వచ్చే కాటి బిహు రోజున తులసి పూజ చేస్తారు.

### అంబుబాచీ



- అసోం రాజధాని గువాహటిలో ఒక కొండమీద వెలసిన దుర్గాదేవి రూపం కామాఖ్య లేదా కామాక్షి. ఇది శక్తి పీఠాల్లో ఒకటి. దక్ష యజ్ఞం సందర్భంగా అవమానానికి గురై యజ్ఞగుండంలో ఆత్మార్పణం చేసుకుంటుంది సతీదేవి. భార్య చనిపోవడంతో మనోవేదనతో శివుడు ఆమె పార్థివదేహాన్ని మీదేసుకొని విరాగిగా తిరుగుతుంటాడు. శివుడిని మళ్లీ మామూలుగా చేసేందుకు విష్ణుమూర్తి సతీదేవి శరీరాన్ని సుదర్శన చక్రంతో ఖండిస్తాడు. అప్పుడు సతీదేవి శరీర భాగాలు భారతదేశంలో వివిధ స్థలాల్లో పడతాయి. అలాంటి స్థలాల్లో గువాహటి ఒకటి.
- ఈ స్థలానికి ఎంతో ప్రాచీనత ఉంది. అయితే ఇప్పుడున్న దేవాలయాన్ని కూచ్ బిహార్ పాలకులు 16వ శతాబ్దంలో నిర్మించారు. ఇక్కడ గర్భాలయంలో కామాఖ్య రూపంలో శక్తిని పూజిస్తారు. ఇక్కడి ఉత్సవాల్లో ప్రధానమైంది అంబుబాచీ మేళా.
- ఏటా ఆషాఢ మాసంలో జరిగే అంబుబాచీ మేళాలో మూడు రోజుల పాటు ఆలయాన్ని మూసేస్తారు. నాలుగో రోజు తెరుస్తారు. ఈ సందర్భంగా భక్తులు లక్షలాదిగా తరలివస్తారు.



### లోసార్

- ఇది టిబెట్ నూతన సంవత్సరం సందర్భంగా అరుణాచల్‌ప్రదేశ్‌లో నిర్వహించే పండుగ. మహాయాన బౌద్ధ మతాన్ని అనుసరించే మొంపా, షెర్డుక్ పెన్స్ మెంబా, ఖంబా, నాహ్ తదితర తెగల వాళ్లు లోసార్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకొంటారు. మూడు రోజుల పండుగైన లోసార్ ఏటా ఫిబ్రవరి 11న మొదలవుతుంది. మొదటి రోజున బౌద్ధ పూజారులు పాల్డెన్ లామోగా పిలిచే ధర్మపాలకు పూజలు చేసి నివేదనలు జరుపుతారు. సాధారణ ప్రజలు తమ బంధుమిత్రులను కలిసి శుభాకాంక్షలు తెలుపుతారు. ఆ ఏడాది పంటలు బాగా పండాలని మొలకెత్తిన బార్లీ విత్తనాలు, త్సాంపా అనే పదార్థాన్ని తమ ఇళ్లలో నివేదిస్తారు.
- రెండో రోజును గ్యాల్పో లోసార్‌గా పిలుస్తారు. ఈ రోజున తెగ నాయకులు, రాజులను స్మరించుకుంటారు. చోక్యాంగ్ లోసార్‌గా పిలిచే చివరి రోజున ధర్మపాలను పూజించి, తమ ఇళ్ల మీద పతాకాలను కడతారు. ఈ రోజుతో లోసార్ పండుగ ముగుస్తుంది. అయితే వేడుకలు మాత్రం మరో 15 రోజులు కొనసాగుతాయి.

### వంగల

- మేఘాలయకు చెందిన గారో తెగ ప్రజలు జరుపుకొనే పండుగ వంగల. పంటకోతల అనంతరం ఏటా నవంబర్ రెండో వారంలో తురాకు దగ్గర్లో ఉన్న అసానంగ్ గ్రామం ఈ పండుగకు వేదిక. దీన్ని తమకు వరాలిచ్చే దేవుడైన మిశి సలాంగ్‌కు గౌరవంగా నిర్వహిస్తారు. పండుగకు ముందురోజు నాక్మాగా పిలిచే గ్రామ పెద్ద కొన్ని సంస్కారాలను నిర్వహిస్తాడు. ఈ సందర్భంగా బీర్, అన్నం, కూరగాయలను మిశి సల్జాంగ్‌కు సమర్పిస్తారు. పండుగ రోజున గారో ప్రజలు సంప్రదాయ దుస్తులు, తలకు పింఛాల గుత్తిని ధరించి బృందంగా ఏర్పడి ఒక రకమైన మద్దెలను వాయిస్తూ పాటలు పాడుతూ నృత్యాలు చేస్తారు. దీన్ని 'హండ్రెడ్ డ్రమ్స్ ఫెస్టివల్' అని కూడా పిలుస్తారు.





### ఆంథూరియం

- మిజోరం రాష్ట్రంలో నిర్వహించే ఈ పండుగను ఆంథూరియం అనే పువ్వు పేరు మీదుగా పిలుస్తారు. దీన్ని ఆ రాష్ట్రంలో పర్యాటక రంగానికి ప్రాముఖ్యం ఇచ్చేందుకు నిర్వహిస్తున్నారు. ఇది ఏటా సెప్టెంబర్‌లో జరుగుతుంది. జానపద నృత్యాలు, సంగీతం, వంటకాలకు ప్రసిద్ధి చెందిన ఈ ఆంథూరియం వేడుకలకు వేదిక రీక్ అనే గ్రామం. ఇది మిజోరం రాజధాని ఐజ్వాల్‌కు 70 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

### నాంగ్‌క్రెమ్ నృత్యం

- పంటకోతల అనంతరం మేఘాలయలో ఖాసీ తెగ ప్రలు జరుపుకొంటారు. దీన్ని ఏటా నవంబర్‌లో నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఖాసీలు కా బ్లెయి సినార్ష్ అనే దేవతకు కృతజ్ఞతగా మేకను బలి ఇస్తారు. ఈ రోజున ఖాసీ యువతీ యువకులు తమ సంప్రదాయ వస్త్రధారణతో నృత్యం చేస్తారు. దీనికి వేదిక షిల్లాంగ్ సమీపంలోని స్మిట్.





### ఖర్చీ పూజ

- త్రిపురలో పది రోజుల పాటు జరిగే పండుగ ఇది. ఒకప్పుడు రాజవంశానికి పరిమితమైన ఈ పండుగ ఉత్సవాల్లో ఇప్పుడు సామాన్య ప్రజలూ పాల్గొంటున్నారు. ఖర్చీ పూజలో భాగంగా పాత అగర్తల లేదా పురానా హవేలీలో ఉన్న పద్నాలుగు దేవతల ఆలయం వేదికగా నిలుస్తుంది. ప్రజలు అక్కడి దేవతలను జంతు బలి, ఇతర పూజలతో కొలుస్తారు. దీనికి వేలాదిమంది హాజరవుతారు. జూలై నెలలో జరుగుతుంది.

### చప్చార్ కుట్

- మిజోరంలో జరుపుకొనే వ్యవసాయ వేడుక. ప్రతి సంవత్సరం మార్చి నెలలో వస్తుంది. చప్చార్ కుట్ పంటలకు నాట్లు వేసేటప్పుడు జరుపుతారు. ఈ వేడుకల్లో చేరా (Cheraw)గా పిలిచే వెదురు నృత్యం ఆకట్టుకుంటుంది. దీంతో పాటు ఖుల్లం, చేహ్లం, చాయ్, సర్లామకాయ్ నృత్యాలనూ చేస్తారు. హస్తకళలు, కళా ప్రదర్శన, ఆహారం, సంగీతాలకు సంబంధించిన పోటీలు చప్చార్ కుట్ వేడుకలో భాగంగా నిర్వహిస్తారు.



### హార్న్‌బిల్ ఫెస్టివల్

- ఈశాన్య భారత రాష్ట్రం నాగాలాండ్‌లో ఏటా డిసెంబర్ 1 నుంచి 10 వరకు జరిగే ఉత్సవమే హార్న్‌బిల్ ఫెస్టివల్. నాగాలాండ్ రాష్ట్రంలో పర్యాటక రంగానికి ప్రాచుర్యం కల్పించేందుకు, ఇంకా వివిధ నాగా తెగలను ఒక చోటుకు చేర్చి, వాళ్లలో ఐక్యతను పాదుకొల్పేందుకు 2000లో మొదలుపెట్టిన కార్యక్రమమే ఈ ఉత్సవం.
- ఈ వేడుకలను నాగాలాండ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. మొదట్లో ఏడు రోజులు జరిగే ఈ వేడుకలకు లభించిన ఆదరణను దృష్టిలో ఉంచుకొని 2013 నుంచి మరో మూడు రోజులు పెంచి, మొత్తం పది రోజులు నిర్వహిస్తున్నారు. దీనికి స్థానిక పక్షి 'గ్రేట్ ఇండియన్ హార్న్‌బిల్' మీదుగా ఈ పేరు నిర్ణయించారు.
- ఉత్సవాలకు వేదికగా రాష్ట్ర రాజధాని కొహిమాకు సమీపంలో ఉన్న 'కిసామా' నాగా వారసత్వ గ్రామాన్ని నిర్ణయించారు. ప్రస్తుతం కేవలం నాగాలాండ్ ప్రజలు మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాల వాళ్లు, విదేశీయులు కూడా ఈ వేడుకలకు గణనీయంగా హాజరవుతున్నారు.
- వేడుకలకు వచ్చే వివిధ తెగల వారు తాత్కాలికంగా ఉండేందుకు మోరంగ్స్ అనే గుడిసెలు ఉంటాయి. వీటిలో నాగాల సంప్రదాయ ఆహారం, బియ్యంతో చేసిన మద్యం అందుబాటులో ఉంచుతారు.
- దాదాపు అన్ని నాగా తెగలు పాల్గొనే ఈ హార్న్‌బిల్ ఫెస్టివల్ నాగాలాండ్ గవాక్షంగా ప్రసిద్ధిచెందింది. పది రోజులు జరిగే ఈ ఉత్సవాల్లో ఆయా తెగల సంప్రదాయ నృత్యాలు, పాటలు, ఆహారం, నాగా మల్లయుద్ధం పోటీలు, విలువిద్య ప్రదర్శన, హస్తకళలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- పందికొవ్వు ఎక్కువగా తినే పోటీ, నాగాలాండ్ కింగ్ చిల్లీ (మిరపకాయలు) తినే పోటీ, కందెన పూసిన 10 అడుగుల ఎత్తయిన వెదురు స్తంభాన్ని ఎక్కే పోటీ, రాక్ సంగీత ప్రదర్శన, మిస్ నాగాలాండ్ పోటీలు, మోటార్ సైకిల్ ర్యాలీ కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి.
- రాత్రిళ్లు కొహిమాలో 'నైట్ బజార్'లో వివిధ వస్తువులు, ఆహార పదార్థాలు వినియోగదారులకు అందుబాటులో ఉంచుతారు. వేడుకల ముగింపు సమయంలో ఒక పెద్ద మంట వేస్తారు. దీనిచుట్టూ నాగా తెగలు గుమిగూడి సామూహిక ప్రదర్శన ఇస్తారు.

### డ్రీ పండుగ

- అరుణాచల్‌ప్రదేశ్‌లోని అపతాని తెగ ప్రజలు జరుపుకొనే పండుగ ఇది. ఏటా జూలై 5న డ్రీ పండుగ నిర్వహిస్తారు. ఈ పండుగ సన్నాహాలు మాత్రం జూలై 4నే మొదలవుతాయి. పంట కోతల సందర్భంగా జరుపుకొనే డ్రీ పండుగ అరుణాచల్‌ప్రదేశ్‌లోని జీరో లోయలో అతిపెద్ద పండుగ.
- పండుగ సందర్భంగా అపతానీలు తాము, హర్నియాంగ్, మేటి, దాన్యి అనే నలుగురు దేవుళ్లకు ప్రార్థనలు చేస్తారు. సంప్రదాయ నృత్యాలు చేస్తారు. తమకు మంచి దిగుబడి వచ్చినందుకు గుర్తుగా దోసకాయలు పంచుతారు. రుచికరమైన వంటకాలు, బియ్యంతో చేసిన మద్యాన్ని తాగుతారు.

### లూయి ఎన్గాయ్ ని

- ఇది నాగా తెగ ప్రజలు జరుపుకొనే వేడుక. నాగాలాండ్‌తో పాటు మణిపూర్‌లోని నాగాలు కూడా దీన్ని నిర్వహిస్తారు. ఏటా ఫిబ్రవరి 15న వచ్చే ఈ పండుగ పంట నాట్లకు సంబంధించింది. అంతేకాకుండా ఇది వివిధ నాగా తెగల మధ్య బంధం బలపడేందుకు కారణంగా నిలుస్తుంది. పండుగలో సంప్రదాయ నృత్యాలు చేస్తారు. రుచికరమైన నాగా సంప్రదాయ వంటకాలు వండుతారు. అగ్నిని వెలిగించి అందులోకి విత్తనాలను చల్లుతారు. ఇది నాగాల ఐక్యతకు, శాంతి సామరస్యాలకు చిహ్నం.

### సాగా దవా

- టిబెట్ కాలమానం ప్రకారం వైశాఖ పౌర్ణమి నాడు బుద్ధ జయంతి సందర్భంగా నిర్వహించే పర్వదినమే సాగా దవా. దీన్ని సిక్కింలో జరుపుకొంటారు. బుద్ధుడి జననం, జ్ఞానోదయం, మహాపరినిర్వాణం జరిగిన రోజు వైశాఖ పౌర్ణమి కావడంతో సాగా దవాను సిక్కిం ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకొంటారు. అందుకే దీన్ని 'మంత్ ఆఫ్ మెరిట్స్' అంటారు.
- సాగా దవా సందర్భంగా ప్రజలు బౌద్ధ ఆలయాలకు చేరుకుంటారు. నీళ్లు, ధూపం, నైవేద్యం సమర్పించి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. మంత్రాలు చదువుతూ, బౌద్ధ గ్రంథాన్ని చేతిలో పట్టుకొని ప్రార్థనా చక్రాలను తిప్పుతారు.

### మోత్సుమోంగ్

- నాగాలాండ్ రాష్ట్రానికి చెందిన అవో (Ao) ప్రజలు నాట్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించే మోత్సుమోంగ్ నాగా తెగల సాంస్కృతిక సుసంపన్నతకు ప్రతీక. దీన్ని ఏటా మే 1 నుంచి 3 వరకు నిర్వహిస్తారు. దీనికి వేదిక నాగాలాండ్‌లోని మోకొక్ చుంగ్ జిల్లా. బావులను శుద్ధి చేయడం, మద్యాన్ని తయారుచేయడంతో వేడుకలు మొదలవుతాయి. ఈ మూడు రోజులూ తమ సంప్రదాయ వంటకాలను రుచి చూస్తూ, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉల్లాసంగా గడుపుతారు. మగవాళ్లు సంప్రదాయ యుద్ధ నృత్యం చేయగా, స్త్రీలు గీతాలు ఆలపిస్తారు.

సంకలనం
**హర్షవర్ధన్ చింతలపల్లి**